# మెరుగైన వైద్య సేవలందించాలి

- వసతి గృహాల్లో డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలి
- పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి
- కలెక్టర్ సత్యప్రసాద్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగెళ గిరిజన ఆశ్రమ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

సారంగాపూర్, జనవరి 31: వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బీర్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంగెళలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, మందుల నిల్వలు, వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, మంగెళలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థుల పడక గదులు, బెడ్లు, వంటశాల, సరుకులు, ఫుడ్ ప్రొవిజన్, పరిసరాలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. దవాఖానకు రోజూ ఎంత మంది వస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మంగెళ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నూతన డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయ్‌లెట్స్ శానిటేషన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, శుద్ధ జలం అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో డ్రైనేజీ సమస్య ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాధికారి రాము, తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ దవాఖాన సందర్శన

జగిత్యాల, జనవరి 31: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ బీ సత్యప్రసాద్ సందర్శించారు. దవాఖానలో చేపడుతున్న మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే, ఎమర్జెన్సీ విభాగం, పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ విభాగం, పలు వార్డుల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, ఆర్ఎంవో సుమన్, దవాఖాన సిబ్బంది, తదితరులున్నారు.

# ఓబన్నను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, జనవరి 31: ఉద్యమాలకు పురుడుపోసిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్డెర ఓబన్న విగ్రహాన్ని శుక్రవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓబన్న పోరాటపటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వడ్డెర కులస్తులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని, చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సహకార సంఘం అధ్యక్షుడు గడ్డం ఆదిరెడ్డి, మాజీ సర్పంచులు కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వనతడుపుల అంజయ్య, ఏనుగందుల సత్యనారాయణగౌడ్, నాయకులు గడి గొప్పుల గోపాల్, గణేశ్, లాసీఫ్, వడ్డెర కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక నాయకులు

# రైతుల గోస పట్టని ప్రభుత్వాలు

- తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలి
- రైతు ఐక్యవేదిక నాయకుల డిమాండ్

మెట్‌పల్లి, జనవరి 31 : ఆరుగాలం కష్టించి పంటలు పండించి దేశానికి అన్నం పెట్టే రైతుల గోస ప్రభుత్వాలకు పట్టడం లేదని రైతు ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలో తమపై నమోదైన రెండు కేసులకు సంబంధించి వారు శుక్రవారం మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు వెలుపల విలేకరులతో మాట్లాడారు. పసుపు బోర్డు, పసుపునకు మద్దతు ధర, మక్కల కొనుగోలు, మూతపడ్డ చక్కెర ఫ్యాక్టరీ తెరవాలని శాంతి యుతంగా నిరసన చేపడితే తమపై కక్ష పూరితంగా అక్రమ కేసులు నమోదు చేశారని వాపోయారు. తమది ప్రజాపాలన, రైతు ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను విస్మరించడం బాధాకరమన్నారు. తక్షణమే రైతు ఉద్యమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రైతు ఐక్యవేదిక నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, మారు మురళీధర్‌రెడ్డి, బందెల మల్లయ్య, అల్లూరి మహేందర్‌రెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి, వేముల కరుణాకర్‌రెడ్డి, అన్నాడి జలపతిరెడ్డి, ఏలేటి శంకర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు.



ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న డిపో మేనేజర్ మనోహర్

## ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం

కోరుట్ల, జనవరి 31: పట్టణంలోని బస్ డిపో ఆవరణలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లు రాజలింగం, యూసూఫ్, శేఖర్‌ను డిపో మేనేజర్ మనోహర్ శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ గంగారాం, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వర్జిలాల్, మెకానికల్ అసిస్టెంట్ ఫోర్‌మెన్ షాదిక్ అలీ, అకౌంట్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ బాబు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సాగర్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వసంత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

పెగడపల్లి, జనవరి 31: పెగడపల్లి మాజీ జడ్పీటీసీ గజ్జెల వసంత ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గాజుల గంగాధర్, నగావత్ తిరుపతినాయక్, బొమ్మెన స్వామి, వొరుగల రాజేశం, తిర్మని నర్సింహారెడ్డి, వెల్మ సత్యనారాయణరెడ్డి, పలుమారు విజయ్‌యాదవ్, ఎండీ జానీపాషా, లచ్చయ్య, మునీందర్ తదితరులున్నారు.

## ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

ధర్మపురి జనవరి 31: భర్త మరణించి, కూతురు క్యాన్సర్‌తో బాధపడుతుండగా, చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద మహిళా కుటుంబానికి ఫేస్‌బుక్ మిత్రులు రూ. 1.31 లక్షలు అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆలపల్లికి చెందిన వాడకొండవార్ రాజు-సరిత దంపతుల కూతురు నందిని (11) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. రాజు నాలుగేళ్ల క్రితం మరణించగా, సరిత కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. కుటుంబ పోషణ కోసమే ఇబ్బందులు పడుతున్న సరితకు కూతురుకు చికిత్స చేయించడం మరింత భారంగా మారింది. నందిని అనారోగ్య సమస్యను సామాజిక మిత్రుల ద్వారా తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని జనవరి 3న ఫేస్ బుక్‌లో పోస్ట్ చేశాడు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు సరిత బ్యాంక్ ఖాతాకు రూ. 1.31 లక్షలు పంపించారు. దాతలు అందించిన విరాళాలతో బాలికకు చికిత్స చేయిస్తున్నారు.

## మహా కుంభమేళాకు వెళ్లి..

- తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు జరిగిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జనవరి 31: మండలంలోని చింతలపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన బర్మ నగేశ్(30) ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామంలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో చింతలపేట మల్లన్నగుడి వద్ద మరో ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో నగేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్ తొలగింపు

సారంగాపూర్, జనవరి 31: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో చౌదారపు గంగాధర్ పర్యటించి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, పోలింగ్ స్టేషన్ల పరిధిలో, గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, గోడలపై రాసిన వాల్ రైటింగ్స్‌ను పంచాయతీ సిబ్బందితో తొలగించారు. ప్రజలు ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలని సూచించారు.

## పసుపు కొనుగోళ్లు ప్రారంభం

మెట్‌పల్లి, జనవరి 31: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు క్రయ, విక్రయాలను శుక్రవారం ప్రారంభించారు. అంతకు ముందు వ్యాపారులు ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కూన గోవర్ధన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం ఏఎంసీ డైరెక్టర్లు పుల్లూరి నవీన్, సంకు గంగాధర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, అడ్డీ, ట్రేడ్ వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

## పసుపు క్వింటాలు @ రూ. 12,666

మెట్‌పల్లి, జనవరి 31: మెట్‌పలి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నుంచి పసుపు క్రయ, విక్రయాల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజు క్వింటాల్ పసుపు కాడి (కొమ్ము)కి గరిష్ఠ ధర రూ.12,666, కనిష్ఠ ధర రూ.7 వేలు పలికింది. అలాగే, పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.10,666, కనిష్ఠ ధర రూ.7 వేలు, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 10,122, కనిష్ఠ ధర రూ.9,566 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి, జనవరి 31: ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహాన్ని మెట్‌పల్లి పట్టణంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోకు ఎన్ఎస్‌యూఐ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ ఎన్ఎస్‌యూఐ నాయకులు గద్దల భరత్‌రాజ్, సమీర్, శ్రీలోక్, జగదీశ్ తదతరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని నివారించాలని వినతి

మారుతీనగర్, జనవరి 31: పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్‌వై నియోజకవర్గ నేత ఒజ్జెల శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ మోహన్‌కు శుక్రవారం కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీటిపై ఆధారపడి ఉన్న కుటుంబాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటినందించాలని వారిచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ కాలనీవాసులు కోట దేవయ్య, బెజ్జారపు వినోద్, అనిల్, గంగరాజం తదితరులున్నారు.

## ఇండ్లల్లోకి ఎస్సారెస్పీ నీళ్లు రాకుండా చర్యలు

పెగడపల్లి, జనవరి 31: పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామ సమీపంలో గల ఎస్సీ కాలనీలో పలు ఇండ్లల్లోకి బుధవారం రాత్రి ఎస్సారెస్పీ కాలువ నీళ్లు రావడంతో సామగ్రి తడిసింది. దీంతో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సారెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దాది మహేశ్, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శోభారాణి వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అలాగే, డ్రాపుల వద్ద, తూముల్లో అడ్డుగా వేసిన బండలను తొలగించి, నీళ్లు కిందకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

## విద్యుత్ మోటారు చోరీ

సారంగాపూర్, జనవరి 31: రేచపల్లి శివారులోని వన నర్సరీలో బోర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వన నర్సరీకి శుక్రవారం ఉదయం ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాశ్ వెళ్లగా బోర్ వద్ద పైపులు, విద్యుత్ తీగలు పడేసి ఉన్నాయి. ఈ విషయం కార్యదర్శి సర్వశ్రేష్టకు తెలియజేయగా నర్సరీని పరిశీలించి, ఘటనా వివరాలను గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో చౌదారపు గంగాధర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎల్వోసీ అందజేత

వెల్గటూర్, జనవరి 31: ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన తరల్ల హిమశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్నది. చికిత్స కోసం విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రూ. లక్ష ఎల్వోసీ మంజూరు చేయించారు. కాగా, హిమశ్రీ కుటుంబసభ్యులకు శుక్రవారం ఆయన ఎల్వోసీ అందజేశారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, జనవరి 31: కాంగ్రెస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, అనంతారం, గుట్రాజ్‌పల్లి, కల్లెడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే వరకు అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన నిలదీయాలన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతై కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలాధ్యక్షుడు ఆనందరావు, నాయకులు గంగారెడ్డి, కమలాకర్ రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'విజయవంతం చేయాలి'

జగిత్యాల, జనవరి 31: ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకొని ఫిబ్రవరి 4న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ, ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుల సంఘం ఆధ్వర్యంలో 2.5 రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యులు శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియం, పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా ఐఎంఏ హాల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. కాగా, శుక్రవారం ఉదయం వివేకానంద మినీ స్టేడియం, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు స్థానికులను కలిసి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, ఏ శ్రీనివాస్, రజిత, శ్రావణ్, సీహెచ్ రమేశ్, ప్రవీణ్, సంతోష్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

జగిత్యాల రూరల్, జనవరి 31: జగిత్యాల అర్బన్ మండల ఎంపీవో వాసవికి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. వాసవికి కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల, జనవరి 31: జగిత్యాలలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం (పీఎస్‌హెచ్ఎంఎ-టీజీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను డీఈవో రాము ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చల్లా లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి అచ్చ విజయ భాస్కర్, సభ్యులు ఆర్ శ్రీనివాస్, నర్సయ్య, సుదర్శన్, రమేశ్, లక్ష్మి, హేమలత, కనక తార తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

వాస్తు చూడబడును

★వాస్తు చూడటం, ఇంటి మోడల్ ప్లానులు తీయడం, భూమి కొలతలు తీయడం,ఆటోక్యాడ్‌లో డ్రాయింగ్ చేయడం నేర్పబడును, వాస్తు చూడబడును. సంప్ర॥ M. రాజేష్, సెల్ : 9502438614

NTK-337604

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## అప్రమత్తంగా వ్యవహరించాలి

మెట్‌పల్లి, జనవరి 31: రోడ్డు భద్రతకు సంబంధించి ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లైతే ప్రమాదాలను నివారించవచ్చని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ఏకాగ్రతతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. డీఎం దేవరాజు మాట్లాడుతూ, ప్రతి డ్రైవర్ విధి నిర్వహణలో భాగంగా బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రమాదరహిత డిపోగా నిలబెట్టాలని కోరారు. అనంతరం ప్రమాదరహిత డ్రైవర్లను శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఐ ప్రమీల, రాజరత్నాకర్, ఏఎంఎఫ్ ఐఆర్‌కేరెడ్డి, సూపరింటెండెంట్ పవన్, ఎస్‌డీఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

మెట్‌పల్లి, జనవరి 31: మెట్‌పల్లి పట్టణానికి చెందిన పారిపెల్లి శ్రీకాంత్ (28) అదృశ్యమై, కాకతీయ కాలువలో శవమై తేలాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాంత్ సంగారెడ్డి జిల్లాలోని జేఎన్‌టీయూలో ఎంటెక్ చదువుతున్నాడు. అలాగే, కంపెనీ ప్రాజెక్ట్ వర్క్ చేస్తూ కొద్ది రోజులుగా డిప్రెషన్‌కు గురవడంతో సమాచారం తెలుసుకున్న సోదరుడు శ్రావణ్ అతని వద్దకు వెళ్లి ఈనెల 29న ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు తెల్లవారుజామున చూసేసరికి శ్రీకాంత్ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పట్టణ సమీపంలోని ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువలో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుడు శ్రావణ్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పెట్రోల్ బంక్ స్థలం ఎంపికపై వివాదం

కథలాపూర్, జనవరి 31: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ కోసం స్థలం ఎంపికపై మూడు రోజులుగా వివాదం జరుగుతున్నది. పెట్రోల్ బంక్‌ను గంభీర్‌పూర్ గ్రామ శివారులో బొమ్మెన గ్రామానికి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేయాలని సహకార సంఘం పాలకవర్గం తీర్మానం చేశారు. జనవరి 3న ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. కానీ ఎంపిక చేసిన స్థలాన్ని మార్కెట్ రేట్ కంటే అధిక ధరకు కొనుగోలు చేయడం సరికాదని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంలో సహకార సంఘం పాలకవర్గసభ్యులు, రైతులకు మధ్య గ్రామంలో మూడు రోజులుగా వివాదం జరుగుతున్నది.

## నేడు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల నిరసన ర్యాలీ

జగిత్యాల టవర్ సర్కిల్, జనవరి 31: ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌టీఎఫ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు టీపీడీపీఎంఎ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలతో సంప్రదిస్తూ, నాయకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## చిన్నారులకు ఆటపాటలతో బోధించాలి

కథలాపూర్, జనవరి 31: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు టీచర్లు ఆటపాటలతో బోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాదిబేగం సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ల మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్రాల వారీగా సమీక్షించారు. పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ప్రభుత్వం కొత్తగా సరఫరా చేసిన ప్రీ స్కూల్ స్టడీ మెటిరియల్‌ను అంగన్‌వాడీ టీచర్లకు పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌పై అంగన్‌వాడీ టీచర్ల సందేహాలను నివృత్తి చేశారు.

## పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల టవర్ సర్కిల్, జనవరి 31: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేసినా ఎంఈవో పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద రాకేశ్ మండిపడ్డారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయమై డీఈవో స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## అంజన్న ఆలయ పరిధిలో ప్రభుత్వ సంస్థల ఉత్పత్తుల విక్రయం

మల్యాల, జనవరి 31: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో ప్రభుత్వరంగ సంస్థలైన జైళ్ల శాఖ, చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్